
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 31 । జులై । 2024



ఏజెన్సీలో అలజడి

ఎన్‌కౌంటర్, మావోయిస్టుల సంచారం, పోలీసుల కూంబింగ్‌తో గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో భయాందోళన నెలకొంది. 10లో



వేగ నియంత్రణతోనే..

వాహనాలు నడిపే డ్రైవర్లు వేగాన్ని నియంత్రించుకోవాలని.. ప్రధానంగా ఆర్టీసీలో ఇది పాటించాలని ఖమ్మం సీపీ అన్నారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 31° / 25°

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం నుంచి జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు జరిపించారు.

అగ్నిమాపక శాఖ అధికారిగా క్రాంతికుమార్



ఎస్పీకి మొక్క అందజేస్తున్న క్రాంతికుమార్

కొత్తగూడెంటౌన్: జిల్లా అగ్నిమాపక శాఖ అధికారిగా మురహరి క్రాంతికుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన కొత్తగూడెం అగ్నిమాపకశాఖ కార్యాలయంలో స్టేషన్ అధికారిగా విధులు నిర్వహించారు. 2022లో హైదరాబాద్‌లోని ట్రెనింగ్ సెంటర్‌కు బదిలీ అయ్యారు. తిరిగి ప్రస్తుతం జిల్లా ఫైర్ ఆఫీసర్‌గా ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీ రోహిత్ రాజ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

డీఎల్‌ఈడీ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం: భద్రాచలంలోని గిరిజన కళాశాలలో 2024–26 విద్యాసంవత్సరానికి గాను డీఎల్‌ఈడీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు. మొత్తం 50 సీట్లకు గాను ఏజెన్సీ ప్రాంతీయులై ఉండి ఇంటర్‌లో 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. భద్రాచలంతో పాటు ఉట్నూరు, ఏటూరునాగారం ఐటీడీఏల్లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు భద్రాచలంలోని కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించి సెప్టెంబర్ 25వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని పీఓ తెలిపారు.

కూలింగ్ టవర్ల కూల్చివేత వాయిదా



కేటీపీఎస్ పాత ప్లాంట్‌లోని కూలింగ్ టవర్లు

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ ఓఅండ్ఎం (పాత ప్లాంట్) కూలింగ్ టవర్ల కూల్చివేత పనులు బుధవారం చేపట్టాల్సి ఉండగా వాయిదా పడింది. ట్రాన్స్‌కో లైన్లలో క్లియరెన్స్ రాకపోవడంతో ఈ పనులకు తాత్కాలికంగా బ్రేక్ పడిందని అధికారులు తెలిపారు. నేటి ఉదయం 8 నుంచి 10 గంటల మధ్యలో ఒక్కొక్కటిగా మొత్తం ఎనిమిది టవర్లు కూల్చివేసేందుకు హెచ్‌ఆర్ కమర్షియల్ సంస్థ అన్ని ఏర్పాట్లు చేసింది. అయితే మంగళవారం రాత్రి వరకు ట్రాన్స్‌కో లైన్ల క్లియరెన్స్ రాకపోవడంతో ఆపేశారు. కాగా, ఈ పనులు వచ్చే సోమవారం నిర్వహించే అవకాశం ఉంది. మరోవైపు అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఎలాంటి విమర్శలు రాకూడదనే ఉద్దేశంతోనే నిలిపివేశారనే చర్చ కూడా జరుగుతోంది. ఇదిలా ఉండగా కూలింగ్ టవర్ల కూల్చివేతపై కర్మాగారం చీఫ్ ఇంజనీర్ పి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అధికారులు సమీక్ష నిర్వహించారు. పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్, సీఐ వినయ్‌కుమార్, ఎస్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎ.అప్పాజీ, ఇన్‌స్పెక్టర్ కిరణ్, జెన్‌కో విజిలెన్స్ డీఎస్పీ రమేష్, ఎస్‌ఈ కిరణ్‌కుమార్ టవర్ల కూల్చివేత ప్రాంతాలను పరిశీలించారు.

గుడ్డు లేని పుడ్డు!



భోజనం వడ్డిస్తున్న కార్మికులు(ఫైల్)

పలు పాఠశాలల్లో అందని పౌష్టికాహారం

- 10 శాతం స్కూళ్లల్లోనే గుడ్లు, రాగిజావ..
- మార్కెట్ ధరలకు అనుగుణంగా అందని బిల్లులు
- పైగా నెలల తరబడిగా పెండింగ్‌లో..
- నేడు ధర్నాకు సిద్ధమవుతున్న 'భోజన' కార్మికులు

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దశల వారీగా సౌకర్యాలు మెరుగవుతున్నా.. మధ్యాహ్న భోజన పథకం మాత్రం లోటుపాట్లతోనే సాగుతోంది. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదు. దీంతో కొందరు ఇంటి నుంచే బాక్సులు తెచ్చుకుంటున్న పరిస్థితి జిల్లాలో నెలకొంది. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులు చేస్తున్న ఆదేశాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. అయితే మార్కెట్ ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడమే ఇందుకు కారణమని అంటున్నారు. నాలుగేళ్ల క్రితం నిర్ణయించిన ధరలే నేటికీ అమలు చేస్తుండడంతో విద్యార్థులు నాణ్యమైన పౌష్టికాహారానికి దూరమవుతున్నారు. ప్రభుత్వం అప్పటి ధరల ప్రకారం బిల్లులు చెల్లిస్తుండగా.. కూరగాయలు, నిత్యావసరాలు, వంటగ్యాస్ ధరలు పెరగడంతో కొనుగోలు చేసే పరిస్థితి లేక మధ్యాహ్న భోజన పథకం కార్మికులు అప్పుల పాలవుతున్నారు. ఇక బిల్లులు, వేతనాలు సైతం నెలల తరబడి పెండింగ్‌లో ఉండడంతో అప్పులకు వడ్డీ కూడా చెల్లించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొన్ని పాఠశాలల్లోనే అమలు..

జిల్లాలో 1065 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 61,870 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రధానోపాధ్యాయులు ఆర్థిక సాయం (అప్పు) అందించే చోట మాత్రమే గుడ్లు, రాగి జావ వండి పెడుతున్నారు. నిబంధనల ప్రకారం వారంలో మూడు రోజులు మధ్యాహ్న భోజనంతో పాటు గుడ్డు వడ్డించాలి. కానీ జిల్లాలో ఈ విధానం 10 శాతం పాఠశాలల్లో మాత్రమే అమలవుతోంది. మిగతా పాఠశాలల విద్యార్థులు వాటికి నోచుకోవడం లేదు. మధ్యాహ్న భోజన కార్మికులు అప్పు చేసి కోడిగుడ్లు కొనుగోలు చేసినా.. బిల్లులు సకాలంలో అందక అవస్థ పడుతున్నారు. ఇక నిత్యావసరాలు, కూరగాయలు కూడా సొంత డబ్బుతోనే కొనుగోలు చేస్తుండగా సక్రమంగా బిల్లులు అందడం లేదు.

2,150 మంది కార్మికులు..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2,150 మంది మధ్యాహ్న భోజన కార్మికులు పని చేస్తున్నారు. వీరందరికీ సకాలంలో బిల్లులు అందక ఇబ్బంది పడుతున్నారు. కోడిగుడ్ల బిల్లులు ఏడాది కాలంగా నిలిచిపోయాయి. 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు సంబంధించి 13 మండలాల కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 50 నుంచి రూ.లక్ష వరకు పెండింగ్‌లో ఉన్నాయి. 9, 10 తరగతుల వారికి సంబంధించి ఒక్కొక్కరికి రూ.50వేల వరకు రావాల్సి ఉంది. కార్మికులు రూ.50 వేలు పెట్టుబడి పెడితే ప్రభుత్వం దశల వారీగా రూ. 5 వేలు, రూ.8 వేలు విడుదల చేస్తోంది. అలా కాకుండా మొత్తం బిల్లులు ఒకే సారి ఇస్తే తమకు అప్పు తీర్చుకునే అవకాశం ఉంటుందని కార్మికులు అంటున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భోజన కార్మికులు బుధవారం హైదరాబాద్‌లో ధర్నాకు సిద్ధమయ్యారు.

నాణ్యతా అంతంతే..

పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వారంలో మూడు రోజులు గుడ్డు అందించాలి. ఇక సాంబారు, కూరగాయలు, ఆకు కూరలు పెట్టాల్సి ఉంటుంది. అయితే నిత్యావసరాలు, కూరగాయలు, గ్యాస్ బిల్లులు సకాలంలో రాకపోవడంతో భోజనంలో నాణ్యత పాటించడం లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు అంటున్నారు. కొందరు పిల్లలు ఈ భోజనం ఇష్టపడక ఇంటి నుంచే బాక్సులు తెచ్చుకుంటున్నారు. ఈ పథకం నాణ్యతా ప్రమాణాలతో విజయవంతంగా కొనసాగాలంటే ప్రభుత్వం సకాలంలో బిల్లులు అందించాలని, లేదంటే గ్యాస్, కూరగాయలు, నిత్యావసరాలు పంపిణీ చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

బిల్లుల విడుదలకు చర్యలు



జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి. ప్రతీ పాఠశాలలో మెనూ ప్రకారం గుడ్డు అందించాలి. నిబంధనల ప్రకారం భోజనం పెట్టకుంటే చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వరాచారి, డీఈఓ

మళ్లీ 'మొదటి'కి..



భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి..

- భద్రాచలం వద్ద 43 అడుగులు దాటి ప్రవహిస్తున్న గోదావరి
- 10 గంటల వ్యవధిలోనే మరోసారి మొదటి ప్రమాద హెచ్చరిక
- తగ్గని గోదావరి వరద ప్రవాహం

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం వద్ద గోదావరి వరద నీటిమట్టం మంగళవారం ఉదయం 6:46 నిమిషాలకు 43 అడుగులు దాటడంతో అధికారులు మరోసారి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. సోమవారం రాత్రి 9 గంటలకు నీటిమట్టం 42.90 అడుగులకు చెరుకోగా మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. తిరిగి కేవలం 10 గంటల వ్యవధిలోనే మళ్లీ పెరగడం గమనార్హం. ఈ నెలలోనే భద్రాచలం వద్ద గోదావరి వరద తగ్గుతూ పెరుగుతూ ముచ్చటగా మూడోసారి.. మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తోంది. మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు నీటిమట్టం 42.80 అడుగులు, 9,22,872 క్యూసెక్కులతో ప్రవహించింది. 4 గంటలకు 42.70 అడుగులకు తగ్గగా తిరిగి ఉదయం 6:46 నిమిషాలకు గోదావరి నీటి మట్టం 43 అడుగుల దాటి ప్రవహించడంతో భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఉదయం 8 నుంచి 9 గంటలకు వరకు 43.20 అడుగుల వద్ద నిలకడగా ఉన్న నీటిమట్టం, 10 గంటలకు 43.30 అడుగులకు చేరుకుంది. అప్పటి నుంచి నెమ్మదిగా పెరుగుతూ 11 గంటలకు నుంచి మధ్యాహ్నం 3 వరకు 43.50 అడుగుల మేర ప్రవహించింది. ఆ తర్వాత స్వల్పంగా పెరుగుతూ రాత్రి 11 గంటలకు 43.90 అడుగులకు చేరింది. కాగా భద్రాచలంలో సోమవారం అర్ధ రాత్రి నుంచి మంగళవారం ఉదయం 9:30 వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది.

వరద ముంపులోనే కొత్తకాలనీ..

గోదావరి వరద, వర్షపు నీటితో ఏర్పడే బ్యాక్ వాటర్ కారణంగా భద్రాచలంలోని అశోక్‌నగర్ కొత్తకాలనీ, స్లూయిస్ సమస్యలతో ఏఎంసీ కాలనీలోని 15 ఇళ్లలోకి నీరు చేరగా ఈ రెండు కాలనీల ముంపు బాధితులను అధికారులు పునరావాస కేంద్రానికి తరలించారు. ఐటీడీఏ పీఓ రాహుల్ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి ఏఎంసీ కాలనీ పరిధిలో గల స్లూయిస్ గేట్లు తెరిపించి, వర్షపు నీరు గోదావరిలో కలిసేలా చర్య తీసుకోవడంతో ఆ ప్రాంతానికి సోమవారం ఉదయం నుంచి వరద ముంపు తొలగింది. ప్రస్తుతానికి ఈ రెండు కాలనీల్లో వరద ముంపు తగ్గినా.. గోదావరి 43 అడుగులు దాటి ప్రవహిస్తుండడంతో ఈ రెండు కాలనీల్లోని 106 కుటుంబాలకు చెందిన 354 మందిని పునరావాస శిబిరంలోనే ఉంచారు.

బదిలీకి ఆలయ ఈఓ, ఉద్యోగుల ఆప్షన్

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయ ఈఓతో పాటు ముగ్గురు ఉద్యోగులు బదిలీ కోసం ఆప్షన్లు పెట్టుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని దేవాదాయ శాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు హాజరుకానున్నారు. ఏడాదిన్నర క్రితం పాలకుర్తి నుంచి ఇక్కడికి ఈఓగా వచ్చిన ఎస్.రజనీకుమారి సత్తుపల్లి మండలం కందుకూరులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి బదిలీ కోసం ఆప్షన్ పెట్టుకోగా, నాలుగేళ్లుగా విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ నర్సింహారావు, జూనియర్ అసిస్టెంట్లు రేణుక, నర్సింహులు కూడా బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

మలి విడత మాఫీ రూ. 137.21 కోట్లు



రుణమాఫీ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

- జిల్లాలో 16,377 మంది రైతులకు లబ్ధి
- అన్ని రైతు వేదికల వద్ద సంబురాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రెండో విడత రుణమాఫీలో భాగంగా జిల్లాలోని 16,377 మంది రైతులకు లబ్ధి చేకూరింది. ఆయా రైతులకు సంబంధించి రూ. 137,21,96,477 వారి బ్యాంకు ఖాతాల్లో మంగళవారం జమ అయ్యాయి. రూ.1.50 లక్షల లోపు రుణం ఉన్న రైతులకు రెండో విడతలో రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు హైదరాబాద్‌లో నిర్వహించిన రుణమాఫీ విడుదల కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసారం చేయగా ఐడీఓసీ నుంచి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఆయా రైతు వేదికల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాలోని 23 రైతు వేదికల వద్ద సంబురాలు నిర్వహించారు.

రైతులు ఆర్థికంగా ఎదగాలి..

రుణమాఫీ ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆకాంక్షించారు. రుణమాఫీ ప్రక్రియ ప్రసారం సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెండో విడతలో రూ 1.50 లక్షల లోపు రుణం ఉన్నవారి బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తామని చెప్పారు. పొలాల్లో నీటి గుంతల తవ్వకానికి ఉపాధిహామీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, నీటి కుంటలలో అజోల్లా నాచు పెంచాలని, తద్వారా యూరియా వాడాల్సిన అవసరం ఉండదని వివరించారు. నీటి కుంటల్లో చేపల పెంపకం కూడా చేపట్టవచ్చన్నారు. పశువుల సంరక్షణ కోసం పాకలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ములకలపల్లి మండలం పాతూరు గ్రామంలో రైతులు చేపల పెంపకం, దుమ్ముగూడెంలో బాతుల పెంపకం చేపట్టారని తెలిపారు. చాలా రాష్ట్రాలలో రైతులు బాతుల పెంపకం ద్వారా మంచి లాభాలు గడిస్తున్నారని చెప్పారు. రుణమాఫీ ద్వారా వచ్చిన డబ్బును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చేపలు, బాతుల పెంపకం, పేడ విక్రయం తదితర పనులతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కంటే ఎక్కువ ఆదాయం సంపాదించవచ్చని అన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు కూడా దృష్టి సారించాలన్నారు. రుణమాఫీలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రుణమాఫీ చెక్కును రైతులకు అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా వ్యవసాయాధికారి వి బాబురావు, ఉద్యాన శాఖాధికారి సూర్యనారాయణ, జిల్లా సహకార అధికారి ఖుర్షిద్, కేవీకే ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ వి లక్ష్మీనారాయణమ్మ, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రుణమాఫీ పొందిన రైతుల వివరాలు

నియోజకవర్గం	మొదటివిడత	రెండో విడత	మొత్తం
అశ్వారావుపేట	7,366	4,242	11,608
భద్రాచలం	4,345	1,960	6,305
కొత్తగూడెం	3,327	1,825	5,152
పినపాక	7,852	4,193	12,045
ఇల్లెందు	3,602	2,996	6,598
వైరా(జూలూరుపాడు)	1,526	1,161	2,687
మొత్తం	28,018	16,377	44,375

పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని ఆందోళన



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కొత్తగూడెంఅర్బన్ : పాత కొత్తగూడెంలోని ఆనంద ఖని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ తల్లిదండ్రులు మంగళవారం స్కూల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 189 విద్యార్థులు ఉండగా ముగ్గురు మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఏడుగురు టీచర్లు బోధించేవారని, ఇప్పుడున్న ముగ్గురిలోనూ నిత్యం ఎవరో ఒకరు సెలవు పెడుతున్నారని అన్నారు. దీంతో అన్ని తరగతుల విద్యార్థులకు సక్రమంగా బోధన అందడం లేదని వాపోయారు. ఇక పాఠశాలలో మధ్యాహ్న బోజనం కూడా సక్రమంగా పెట్టడం లేదని, బాత్‌రూంల నిర్వహణ సరిగా లేదని, దుర్వాసన వెదజల్లుతోందని విద్యార్థులు తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఆందోళన విరమింపజేసేందుకు అక్కడున్న ఇద్దరు ఉపాధ్యాయులు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా విద్యార్థులు, తల్లిదండ్రులు ససేమిరా అన్నారు. సమాచారం అందుకున్న ఎంఈఓ జుంకీలాల్ పాఠశాలకు చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాలలో పని చేస్తున్న నలుగురు ఉపాధ్యాయులు డిప్యుటేషన్‌పై ఇతర స్కూళ్లకు వెళ్లారని, దీంతో కొరత ఏర్పడిందని చెప్పారు. తగినంత మంది టీచర్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు సక్రమంగా బోధన అందేలా చూస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

డ్రోన్ మాక్‌డ్రిల్ పరిశీలన..

సుజాతనగర్: మండలంలోని సింగభూపాలెం చెరువు వద్ద మంగళవారం నిర్వహించిన డ్రోన్ మాక్‌డ్రిల్‌ను కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ పరిశీలించారు. వరదలో చిక్కుకున్న వారికి డ్రోన్ ద్వారా లైఫ్ జాకెట్లు, ఆహార సామగ్రిని ఎలా అందించవచ్చనే వివరాలను తెలుసుకున్నారు. జిల్లాలో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి ప్రత్యేకంగా శిక్షణ పొందిన డీడీఆర్ఎఫ్ బృందం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. గోదావరి వరదలు వచ్చినప్పుడు లోతట్టు ప్రాంతాల వారిని సంరక్షించడానికి ఈ బృందం అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, చుంచుపల్లి సీఐ ఆర్ వెంకటేశ్వర్లు, ఎస్సై జుబేదాబేగం తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్



సబ్ సెంటర్ భవనాన్ని పరిశీలిస్తున్న భాస్కర్‌నాయక్

కొత్తగూడెంరూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఎల్.భాస్కర్‌నాయక్ అన్నారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి మంగళవారం ఆయన అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పల్లెల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేస్తే విష జ్వరాలను నివారించవచ్చని సూచించారు. జ్వరాల బారిన పడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. జిల్లాలోని అన్ని ఆస్పత్రుల పరిధిలో ఫీవర్ సర్వే చేయిస్తున్నామని తెలిపారు.

సబ్‌సెంటర్ పరిశీలన..

లక్ష్మీదేవిపల్లిలో నిర్మించిన సబ్ సెంటర్ భవనాన్ని భాస్కర్‌నాయక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అసంపూర్తిగా ఉన్న సబ్ సెంటర్ భవన నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేసి అందుబాటులో తీసుకొస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాతా శిశు సంరక్షణ అధికారి చైతన్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

సదుపాయాలు మెరుగుపర్చాలి



సబ్ జైలులో పరిశీలిస్తున్న న్యాయమూర్తి కీర్తి చంద్రికారెడ్డి

ఇల్లెందు: ఖైదీలకు సకాలంలో వైద్యం అందించాలని, సదుపాయాలు మెరుగుపర్చాలని న్యాయమూర్తి దేవరపల్లి కీర్తి చంద్రికారెడ్డి సూచించారు. పట్టణంలోని సబ్ జైలును మంగళవారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఖైదీలకు అందుతున్న మెనూ అడిగి తెలుసుకున్నారు. జైలులో పరిశుభ్రత పాటించాలన్నారు. పేద ఖైదీలకు లీగల్ క్లినిక్‌ల ద్వారా న్యాయ సహాయం అందిస్తామన్నారు. న్యాయమూర్తి వెంట జైలు వార్డర్ చంద్రశేఖర్, హెడ్ వార్డర్ భుజరంగ రాజు, శ్రీనివాస్, న్యాయవాదులు ఉమామహేశ్వరరావు, కీర్తికార్తీక్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లెందులో మావోయిస్టు పోస్టర్లు

ఇల్లెందు: పట్టణంలోని కొత్త బస్టాంట్ సెంటర్‌లో మంగళవారం రాత్రి మావోయిస్టు పోస్టర్లు వెలిశాయి. జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహించాలని, భారతవనిలో బ్రాహ్మణీయ మనువాద దోపిడీ నిర్మాణ లక్ష్యంతో ప్రజలపై కొనసాగుతున్న విప్లవ ప్రతిఘాతుక కగార్ ఆపరేషన్‌ను ఓడించాలని పోస్టర్లలో పేర్కొన్నారు. మణుగూరు–పాల్వంచ ఏరియా కమిటీ పేరుతో పోస్టర్లు వేశారు. కాగా మావోయిస్టు పోస్టర్లు వెలుగుచూడటంతో పట్టణంలో కలకలం రేగింది.

తక్షణమే కోర్టులో హాజరుపర్చాలి

చర్ల: జేఎండబ్ల్యూపీ డివిజన్‌లోని ఏటూరి నాగారం – మహదేవ్‌పూర్ దళానికి చెందిన నిరాయుధులైన ముగ్గురు సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకుని, చిత్రహింసలకు గురిచేస్తున్నారని మావోయిస్టు పార్టీ జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక లేఖను విడుదల చేశారు. ముగ్గురిని ఎన్‌కౌంటర్ పేరుతో హతమార్చే ప్రయత్నం చేస్తున్నారని, తక్షణమే వారిని కోర్టులో హాజరుపర్చాలని పేర్కొన్నారు. 29న జైసింగ్, రమేష్‌లను 30న సుక్కిని చర్ల పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. అరెస్టు చేసిన వారిని 24 గంటల్లోగా కోర్టులో హాజరు పరచాల్సి ఉన్నప్పటికీ పోలీసులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. పోలీసుల అదుపులో ఉన్న ముగ్గురు సభ్యులకు ఎటువంటి హాని తలపెట్టినా అందుకు కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక నాయకులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలు

కొత్తగూడెంటౌన్: చెక్ బౌన్స్ కేసులో లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్‌కాలనీకి చెందిన మురళీధర్‌రావుకు ఏడాది జైలుశిక్షతో పాటు రూ.20 లక్షల నగదు చెల్లించాలని మంగళవారం కొత్తగూడెం న్యాయమూర్తి కె.సాయిశ్రీ తీర్పుచెప్పారు. కొత్తగూడేనికి చెందిన న్యాయవాది ఇలమోలు ఉదయ్‌భాస్కర్‌రావు వద్ద శ్రీనగర్ కాలనీ చెందిన నూతలపాటి మురళీధర్‌రావు రూ.25 లక్షలు అప్పుగా తీసుకుని ప్రామిసరీ నోట్ రాసి ఇచ్చాడు. డబ్బులు తిరిగి చెల్లించక పోవడంతో ఖమ్మం ఆరో అదనపు జిల్లా కోర్టులో 2013లో దావా వేయగా, 28.4.2017న డిక్రీ (డబ్బులు తిరిగి చెల్లించాలని తీర్పు) అయింది. 15.12.2017లో రూ.20 లక్షలకు చెక్కు ఇవ్వగా, బ్యాంకులో జమ చేస్తే ఖాతాలో నగదు లేకపోవడంతో బౌన్స్ అయింది. దీంతో ఉదయ్‌భాస్కర్‌రావు కోర్టులో కేసు వేశారు. విచారణ చేసిన జడ్జి పైవిధంగా తీర్పు చెప్పారు. ఫిర్యాదుదారు తరఫున న్యాయవాది రమేష్‌కుమార్ మక్కడ్ వాదించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



ఉపేందర్ (ఫైల్)

టేకులపల్లి: అప్పుల బాధ తట్టుకోలేక తీవ్ర మనోవేదనతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. టేకులపల్లి ఎస్‌ఐ పి.సురేష్ కథనం ప్రకారం.. మండలంలోని కోయగూడెం గ్రామానికి చెందిన రైతు జాల ఉపేందర్ (30) నాలుగేళ్ల క్రితం అప్పుచేసి రెండెకరాల భూమి కొన్నాడు. ఆశించిన మేరకు పంటల దిగుబడి రాకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక ఆందోళన చెందుతుండేవాడు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే తీవ్ర మనోవేదనకు గురై సోమవారం రాత్రి పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. దీంతో పక్క చేను రైతు ఇచ్చిన సమాచారంతో కుటుంబ సభ్యులు ఉపేందర్‌ను కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి పెద లాలయ్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,705

గుండాల ఏజెన్సీలో అలజడి

- పోలీసుల అదుపులో వలస ఆదివాసీ?
- ఇటీవలే దామరతోగు అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్
- గుండాల, కరకగూడెం, తాడ్వాయి మండలాల సరిహద్దులో ముమ్మరంగా కూంబింగ్



పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొంటున్న వలస ఆదివాసీ గిరిజనుడి ఇల్లు

గుండాల: ఎన్‌కౌంటర్, మావోయిస్టుల సంచారం, పోలీసుల కూంబింగ్‌తో గుండాల, ఆళ్లపల్లి మండలాల్లోని పల్లెల్లో భయాందోళన నెలకొంది. సోమవారం రాత్రి మండల పరిధిలోని దామరతోగు గ్రామానికి చెందిన ఓ ఆదివాసీ గిరిజనుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అతని ఇంట్లో ఓ తుపాకీని కూడా స్వాధీన చేసుకున్నట్లు తెలిసింది. దామరతోగు అడవుల్లో ఎన్‌కౌంటర్‌లో జరిగి ఐదు రోజులు గడవక ముందే మరో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలుస్తుండటంతో ఏజెన్సీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పక్కా సమాచారంతో వచ్చిన పోలీసులు దామరతోగు గ్రామానికి చెందిన, ఓ రైతు వద్ద పశువుల కాపరిగా పనిచేస్తున్న మొల్కం ముఖేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అతని ఇంట్లో ఓ బడ్డీ కింద గుంత తవ్వి దాచిపెట్టిన తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తి మావోయిస్టు సానుభూతిపరుడా? కాకపోతే అతనికి తుపాకీ ఎక్కడి నుంచి వచ్చిందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి గొత్తికోయ కుటుంబాలు వచ్చి దామరతోగు గ్రామ సమీపంలో నివాసాలు ఏర్పాటు చేసుకోగా, రెండేళ్ల క్రితం ఫారెస్టు అధికారులు వెళ్లగొట్టారు. ముఖేష్, అతని తండ్రి భీమా మాత్రం దామరతోగులోనే ఉండిపోయారు.

ఈ నెల25న ఎన్‌కౌంటర్..

ఈ నెల 25న తాడ్వాయి మండలం బల్లెపల్లి–గుండాల మండలం దామరతోగు సరిహద్దులో మావోయిస్టులకు, పోలీసులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో భూపాలపల్లి జిల్లా గణపురం మండల బుద్దారం గ్రామానికి చెందిన మావోయిస్టు అశోక్ మృతి చెందాడు. మరో పక్క ఈ నెల 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టు వారోత్సవాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో స్పెషల్‌పార్టీ, గ్రేహౌండ్స్ పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. తాడ్వాయి, గుండాల, కరకగూడెం మండలాల సరిహద్దు ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. దీంతో గిరిజన గ్రామాల్లో ఎక్కడ ఏమి జరుగుతుందోనని తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. దామరతోగు గ్రామానికి చెందిన వ్యక్తి అదుపులో ఉన్న విషయమై గుండాల సీఐ రవీందర్‌ను వివరణ కోరగా.. అలాంటిది ఏమీ లేదని తెలిపారు.

పోలీసుల అదుపులో ముగ్గురు సభ్యులు



తుపాకీ కోసం తవ్విన గుంత

ఈ నెల 29న ఏటూరు నాగారం–మహదేవ్‌పూర్ పరిధిలో ఇద్దరు దళ సభ్యులు జైసింగ్, రమేష్‌లతో పాటు, చర్ల మండలంలో సుక్కి అనే దళ సభ్యురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు మావోయిస్టు జేఎమ్‌డబ్ల్యూపీ డివిజన్ పేరిట ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. ప్రాణహాని తలపెట్టకుండా, కోర్టులో హాజరుపర్చాలని ప్రకటనలో పేర్కొన్నారు.

వేగ నియంత్రణతోనే సురక్షిత ప్రయాణం



ప్రమాదరహిత డ్రైవర్లుగా ఎంపికైన వారితో సీపీ సునీల్ దత్, ఆర్‌ఎం సరిరామ్ తదితరులు

- ఆర్టీసీ ప్రమాద రహిత వారోత్సవాల్లో ఖమ్మం సీపీ సునీల్‌దత్

ఖమ్మంమయూరిసెంటర్: రోడ్లపై వాహనాలు నడిపే డ్రైవర్లు వేగాన్ని నియంత్రించుకోవాలని.. ప్రధానంగా ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు ఈ సూచన పాటించాలని ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. ఆర్టీసీ ప్రమాద రహిత వారోత్సవాల ముగింపు సమావేశం మంగళవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రీజియన్ స్థాయిలో ప్రమాద రహిత డ్రైవర్లుగా గుర్తింపు పొందిన వారిని సీపీ సత్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో అతి తక్కువ ప్రమాదాల శాతం కలిగిన సంస్థ ఆర్టీసీ మాత్రమేనని తెలిపారు. లక్షలాది మందిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్న డ్రైవర్లు దేవుళ్లతో సమానమని చెప్పారు. ఆర్టీసీ ఆర్‌ఎం ఏ.సరిరామ్ మాట్లాడుతూ ప్రమాద రహిత వారోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు సూచనలు చేయడంతో పాటు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు.

ఉత్తమ డ్రైవర్లు వీరే...

ఖమ్మం రీజియన్ స్థాయిలో సత్తుపల్లి డిపోకు చెందిన ఎస్.వీ.ఎస్.రావు 31ఏళ్ల 11 నెలల సర్వీస్‌లో ఒక్కప్రమాదం చేయని డ్రైవర్‌గా మొదటి స్థానంలో నిలిచారని ఆర్‌ఎం తెలిపారు. అలాగే, ఖమ్మం డిపోకు చెందిన డి.ఆంథోని, బి.రాములు 27ఏళ్ల 11 నెలల సర్వీస్‌లో ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉన్నారని చెప్పారు. అంతేకాక ప్రతీ డిపోకు ముగ్గురు ప్రమాద రహిత డ్రైవర్లను గుర్తించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆర్టీఓ వెంకటరమణ, ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ జీ.ఎస్.పవిత్ర, డిపో మేనేజర్ దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన


- దేహశుద్ధి చేసిన తల్లిదండ్రులు.. పోలీసులకు ఫిర్యాదు
- ఇల్లెందు ఎస్టీ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఘటన



రాందాస్‌ను ప్రశ్నిస్తున్న ఏటీడీఓ రాధమ్మ, హెచ్‌ఎం పద్మావతి

ఇల్లెందు: విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. అభం శుభం తెలియని చిన్నారులపై దుశ్చర్యలకు పాల్పడుతూ పైశాచిక ఆనందం పొందాడు. భరించలేకపోయిన బాలికలు తల్లిదండ్రుల వద్ద గోడు వెళ్లబోసుకున్నారు. తమను ఆ టీచర్ బారి నుంచి రక్షించకుంటే బడి మానేస్తామని చెప్పారు. దీంతో తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసిన ఘటన ఇల్లెందు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల(ఓల్డ్)లో మంగళవారం చోటుచేసుకుంది. ఆశ్రమ పాఠశాలలో భౌతిక శాస్త్రం బోధించే సీఆర్టీ ఎ.రాందాస్ తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించసాగాడు. గతేడాది కూడా ఇలాగే వేధించగా హెచ్‌ఎం పద్మావతి, అప్పటి ఏటీడీఓ రూపాదేవి దృష్టికి బాలికలు తీసుకెళ్లారు. వారు మందలించగా మరోసారి ఇలాంటి తప్పు చేయనని అంగీకరించడంతో వదిలేశారు. ఇక ఈ సంవత్సరం పాఠశాల పునఃప్రారంభం నుంచి మళ్లీ అదే తరహా వేధింపులకు పాల్పడుతున్నాడు. దీంతో భరించలేకపోయిన విద్యార్థినులు తల్లిదండ్రులకు చెప్పగా రేలకాయలపల్లి, తడికెలపూడి, మూడుతండా, జైత్రాంతండాకు చెందిన పలువురు తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయుడిని ప్రశ్నించారు. తల్లిదండ్రుల ఆగ్రహాన్ని గమనించిన రాందాస్ తప్పించుకునే ప్రయత్నం చేయగా.. కోపోద్రిక్తులైన పేరెంట్స్ పట్టుకుని దేహశుద్ధి చేశారు. సహచర ఉపాధ్యాయులు, వర్కర్లు అడ్డుకుని రాందాస్‌ను ఓ గదిలో దాచి పెట్టగా తల్లిదండ్రులతో పాటు హెచ్‌ఎం పద్మావతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ నాగుల్ మీరా పఠాన్ వచ్చి ఉపాధ్యాయుడిని స్టేషన్‌కు తరలించారు. ఇంతలో ఏటీడీఓ రాధమ్మ అక్కడికి చేరుకుని ఐటీడీఏ పీఓ రాహుల్, డీడీ మణెమ్మకు సమాచారం అందించారు. కాగా, టీచర్ రాందాస్‌ను సర్వీస్ నుంచి తొలగించాలని విద్యార్థినులు ఐటీడీఏ పీఓకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కాగా, రాందాస్‌పై ఎస్‌ఐ నాగుల్ మీరా పఠాన్ పోక్సో కేసు నమోదు చేశారు.


నీటిగుంతలో పడి బాలుడి మృతి



బాలుడి మృతితో రోదిస్తున్న తల్లి, కుటుంబీకులు

దమ్మపేట: పాఠశాలకు వెళ్లిన ఓ విద్యార్థి నీటిగుంతలో పడి మృతి చెందాడు. ఈ ఘటన దమ్మపేట మండల పరిధిలోని ఆర్లపెంట ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఆర్లపెంట గ్రామానికి చెందిన తోలెం మల్లేష్, కుమారి దంపతులకు ఇద్దరు సంతానం. వీరిలో చిన్నవాడు వరుణ్ కుమార్(8) గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. మంగళవారం పాఠశాలకు వెళ్లిన వరుణ్ మధ్యాహ్న భోజనం తర్వాత మరో ఇద్దరు విద్యార్థులు కలసి వెళ్లి సమీపంలోని నీటి కాలువ వద్ద ఆడుకున్నారు. తడిసిన బట్టలతో పాఠశాలకు వెళ్లగా, ఇంటికెళ్లి మార్చుకుని రావాలని ఉపాధ్యాయురాలు సూచించారు. కానీ ముగ్గురు విద్యార్థులు ఇంటికి వెళ్లకుండా పాఠశాల వెనుకే ఉన్న నీటి గుంత వద్దకు వెళ్లారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు వరుణ్ కుమార్ నీటి గుంతలో పడిపోయాడు. కాగా వరుణ్ కుమార్ కనిపించడంలేదని అతనితో వెళ్లిన విద్యార్థులు గ్రామస్తులకు చెప్పారు. దీంతో గ్రామస్తులు, తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయురాలు సంధ్యారాణిని ప్రశ్నించి, వాగ్వాదానికి దిగారు. అనంతరం గాలింపు చేపట్టగా వరుణ్‌కుమార్ నీటిగుంతలో విగతజీవిగా కనిపించాడు. దీంతో కోపోద్రిక్తులైన తల్లిదండ్రులు, గ్రామస్తులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. అనంతరం దమ్మపేట–పాల్వంచ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. మృతిపై విచారణ చేసి, తగిన న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అశ్వారావుపేట ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించి కేసు విచారణ చేస్తున్నారు. పాఠశాలకు వెళ్లిన బిడ్డ విగత జీవిగా మారడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది.

404 అడుగులకు కిన్నెరసాని..



ప్రాజెక్ట్ నుంచి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు

కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షానికి కిన్నెరసాని జలాశయానికి వరద ఉధృతి పెరుగుతోంది. 407 అడుగుల నీటినిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 9 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. జలాశయం నీటిమట్టం 404.60 అడుగులకు చేరగా, ప్రాజెక్ట్ నాలుగు గేట్లను ఎత్తి ఉంచి 20 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు డ్యామ్‌సైడ్ పర్యవేక్షక ఇంజనీరు తెలిపారు. కిన్నెరసాని పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. – పాల్వంచరూరల్

భద్రాచలం ఎమ్మెల్యే బీఆర్‌ఎస్‌లోకి వెళ్తున్నారంటూ ప్రచారం

భద్రాచలం: రాజకీయంగా సంచలనమైన కామెంట్లు చేయకున్నా భద్రాచలం ఎమ్మెల్యేగా ఎన్నికై నప్పటి నుంచి తెల్లం వెంకట్రావు వార్తల్లో నిలుస్తున్నారు. బీఆర్‌ఎస్ నుంచి అసెంబ్లీకి ఎన్నికై న ఆయన ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఆయనపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్‌ఎస్ డిమాండ్ చేస్తోంది. కాగా రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న తరుణంలో వెంకట్రావు బీఆర్‌ఎస్ శాసనసభా పక్ష కార్యాలయానికి వెంకట్రావు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. బీఆర్‌ఎస్ నేతలతో కలిసి ఉన్న ఫొటోలు బయటకు లీక్ అవడంతో వెంకట్రావు కాంగ్రెస్‌ను వీడి తిరిగి గులాబీ గూటికి చేరుతున్నారంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగింది. అయితే స్నేహపూర్వకంగానే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను కలిశారని, రాజకీయ ఉద్దేశాలు ఏమీ లేవంటూ వెంకట్రావు మద్దతుదారులు ఈ ప్రచారానికి బ్రేకులు వేశారు.

బంగారం, నగదు చోరీ



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

జూలూరుపాడు: పోలీస్ స్టేషన్ వెనుకనే ఉన్న న్యూకాలనీలో సోమవారం అర్ధరాత్రి మూడు చోట్ల చోరీలు జరిగాయి. పోలీసుల కథనం ప్రకారం.. న్యూకాలనీకి చెందిన సమందల రాజేష్ దంపతులు తమ ఇంటికి తాళం వేసి ఊరెళ్లారు. సోమవారం అర్ధరాత్రి తాళం పగులగొట్టి బీరువాలోని రూ.50 వేల నగదు, రెండు తులాల బంగారం అపహరించారు. ఇదే కాలనీకి చెందిన కాశిమల్ల సురేష్ బడ్డీ కొట్టు తాళం పగలగొట్టి సుమారు రూ.2 వేలు నగదు ఎత్తుకెళ్లారు. అంగన్‌వాడీ కేంద్రం తలుపు తాళం పగులగొట్టి చోరీకి యత్నించారు. ఒకే ప్రాంతంలో ఒకే రోజు మూడు చోట్ల చోరీలు జరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. జూలూరుపాడు సీఐ ఇంద్రసేనా రెడ్డి, ఎస్‌ఐ రాణా ప్రతాప్ ఘటనా స్థలాలను సందర్శించి వివరాలు సేకరించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా న్యూకాలనీ పోలీస్ స్టేషన్ వెనక ఉన్న న్యూకాలనీలో చోరీలు జరగడం విశేషం.

మందుపాతర వెలికితీత

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులు పోలీసులను లక్ష్యంగా చేసుకుని ఏర్పాటు చేసిన 10 కిలోల శక్తిమంతమైన మందుపాతరను మంగళవారం పోలీసులు గుర్తించి వెలికి తీశారు. కూంబింగ్‌కు వచ్చే పోలీసు బలగాలను మట్టుబెట్టాలనే లక్ష్యంతో బీజాపూర్ జిల్లా కుట్రు పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబేలీ వద్ద గల వంతెన సమీపంలో మావోయిస్టులు మందుపాతర ఏర్పాటు చేశారు. పోలీసులు గుర్తించడంతో పెను ప్రమాదం తప్పింది.

గుండెపోటుతో మాజీ సూపరింటెండెంట్ మృతి

గతంలో జిల్లా సర్వజన ఆస్పత్రిలో విధి నిర్వహణ



కుమారస్వామి (ఫైల్)

కొత్తగూడెంరూరల్ : కొత్తగూడెం జిల్లా సర్వజన ఆస్పత్రిలో గతంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించిన, మంచిర్యాల మెడికల్ కళాశాల ప్రొఫెసర్ బోడ కుమారస్వామి సోమవారం రాత్రి హనుమకొండలోని తన ఇంట్లో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించిన సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని అప్పటి కలెక్టర్ ప్రియాంక ఆల సరెండర్ చేశారు. దీంతో డీఎంఈలో రిపోర్టు చేశారు. మళ్లీ సూపరింటెండెంట్‌గా వచ్చేందుకు ప్రయత్నించినా, సాధ్యం కాలేదు. అనంతరం మంచిర్యాల మెడికల్ కళాశాలలో జనరల్ సర్జన్‌గా నియమితులయ్యారు. మంగళవారం కొత్తగూడెం వచ్చి రిలీవ్ కావాల్సి ఉంది. ఈలోపే గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం హనుమకొండలో అంత్యక్రియలు పూర్తిచేశారు. సర్వజన ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రాధామోహన్, కొందరు వైద్యులు, సిబ్బంది హనుమకొండలో ఆయన మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

చికిత్స పొందుతున్న కార్మికుడు...



రామ్మోహన్ (ఫైల్)

మణుగూరు టౌన్: గాయపడి చికిత్స పొందుతున్న సింగరేణి కార్మికుడు సోమవారంరాత్రి మృతి చెందాడు. ఓసీ–2లోని ఎస్‌అండ్‌డీ విభాగంలో మోటార్‌వెహికల్ డ్రైవర్‌గా పనిచేస్తున్న పి.రామ్మోహన్ ఈ నెల 22న తన భార్య జ్యోస్నా రాణితో కలిసి మణుగూరు నుంచి పీవీకాలనీకి హనుమాన్ టెంపుల్ మీదుగా కారులో వెళ్తున్నాడు. ముత్యాలమ్మనగర్ వద్దకు రాగానే ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఏర్పడి కారు దగ్ధమైంది. దీంతో రామ్మోహన్‌కు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు మణుగూరు ఎస్‌ఐ రంజిత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా కార్మికుడి మృతిపట్ల ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ వై.రాంగోపాల్, రామనర్సయ్య, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు, గట్టయ్య సంతాపం వ్యక్తం చేశారు.

బీటీపీఎస్‌లో కార్మికుడికి గాయాలు



కాలిపై వేడి నీళ్లు పడి గాయమైన దృశ్యం

మణుగూరుటౌన్/మణుగూరు రూరల్: బీటీపీఎస్‌లోని నాలుగో యూనిట్ ఐబీడీ శాంపిల్ పాయింట్ వద్ద మంగళవారం విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడిపై శాంపిల్(వేడి) వాటర్ పడటంతో గాయాలయ్యాయి. మండల పరిధిలోని సాంబాయిగూడెం గ్రామానికి చెందిన షేక్ నాగుల్‌మీరా శ్యాంప్రసాద్ కన్‌స్ట్రక్షన్స్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. రోజులాగానే తనకు కేటాయించిన నాలుగో యూనిట్ ఐబీడీ శాంపిల్ పాయింట్ వద్ద విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో సుమారు 600 డిగ్రీల ఉష్ణోగ్రత కలిగిన శాంపిల్ వాటర్ నాగుల్‌మీరా కుడికాలుపై కొద్దిమొత్తంలో పడడంతో తీవ్రంగా గాయమైంది. తోటి కాంట్రాక్ట్ కార్మికులు 108 ద్వారా నాగుల్‌మీరాను వైద్యసేవల కోసం మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నల్లబెల్లం, పటిక స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

టేకులపల్లి/ఇల్లెందురూరల్: ఎక్సైజ్ అధికారులు మంగళవారం నల్లబెల్లం, పటిక స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్ కథనం ప్రకారం.. కొత్తగూడెం మీదుగా టేకులపల్లి, ఇల్లెందు, మహబూబాబాద్ ప్రాంతాలకు గుడుంబా తయారీకి వినియోగించే ముడిసరుకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో వాహనాల తనిఖీ చేపట్టిన ఎక్సైజ్ అధికారులు ముత్యాలంపాడు స్టేజీ వద్ద డీసీఎం వ్యాన్‌ను ఆపి తనిఖీ చేశారు. అందులో 8 క్వింటాళ్ల నల్లబెల్లం, 1.5 క్వింటాళ్ల పటిక, 40 లీటర్ల సారాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఏపీ రాష్ట్రంలోని కాకినాడ ప్రాంతానికి చెందిన ఏలూరి వెంకటేశ్వర్లు, కడగిరి గంగరాజు, కొత్తగూడేనికి చెందిన తుర్కేల్ విక్కి, టేకులపల్లికి చెందిన జర్పుల బాబులను అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు.

యువకుడి అదృశ్యం



అనిల్ (ఫైల్)

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని భగవాన్‌దాస్ కాలనీకి చెందిన యువకుడు అనిల్ సోమవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో అతని తండ్రి హరి మంగళవారం మధ్యాహ్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. వృత్తి రీత్యా కారు డ్రైవర్ అయిన అనిల్ బ్రిడ్జిపై నుంచి గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానం రావడంతో, కుటుంబ సభ్యులు గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.